అభివృద్ధి పనులకు ఆమోదం

తూప్రాన్: పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు.

పాలకవర్గం ఆమోదించిన అభివృద్ధి పనులు

- మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పోతారాజ్ పల్లి కమాన్ వద్ద ఐ ల్యాండ్, జంక్షన్ బ్యూటిఫికేషన్.
- బస్టాండ్‌లో ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మీనార్, క్లాక్ టవర్, వాటర్ ఫౌంటెన్, జంక్షన్ బ్యూటిఫికేషన్ చేయడం.
- వినాయక్ నగర్ కాలనీలో 'జె' షేప్ పోల్స్ వీధిలైట్లు ఏర్పాటు.



హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది

- మున్సిపల్ పరిధిలోని 16 వార్డులలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం చెట్లు నాటుటకు కావల్సిన టాల్ ప్లాంట్స్, ఫ్లవర్ ప్లాంట్స్.

ఈ సమావేశంలో గడా ప్రత్యేకాధికారి ముత్యం రెడ్డి, కమిషనర్ మోహన్, వైస్ చైర్‌పర్సన్ నందాల శ్రీనివాస్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

హామీలను త్వరగా నెరవేర్చాలి

మెదక్‌జోన్: జిల్లాపై మంత్రి హరీష్‌రావు కపట ప్రేమ చూపుతున్నారని, ఆయన ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మిగులుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని పిట్లం చెరువును సందర్శించిన వారు అక్కడ జరగాల్సిన అభివృద్ధి జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్‌లో మినీ ట్యాంకు బండ్ నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయన్నారు. 2016 మార్చి 14న ఎమ్మెల్యే, మంత్రి మిషన్ కాకతీయలో భాగంగా పట్టణంలోని గోసముద్రం, పిట్లం చెరువు మినీ ట్యాంక్ బండ్ గా మార్చటానికి రూ.9.50కోట్లతో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. దాదాపుగా 7 సంవత్సరాలు దాటినా.. ట్యాంకు బండ్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. అయితే మంత్రి మళ్లీ 11 కోట్ల రూపాయలు గోసముద్రం చెరువు అభివృద్ధికి విడుదల చేస్తున్నట్టు కేవలం చెప్పి ఇంతవరకు మంజూరు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మోల్ సాబ్, అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నవీన్ చౌదరి, పుల్లబోయిన దుర్గేష్, జాకార్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

టీచర్‌ను డిప్యూటేషన్‌పై పంపుతాం : డీఈఓ



వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ రాధాకిషన్

సాక్షి ఎఫెక్ట్..

రామాయంపేట(మెదక్): 'తరగతి గదిలో ఒకే ఒక్కడు' శీర్షికన ఈనెల 20న సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి డీఈవో రాధాకిషన్ స్పందించారు. నార్సింగి మండలం జప్తి శివునూర్ సరోజినీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు హాజరైన ఒకే ఒక విద్యార్థికి పాఠం చెబుతున్న ఉపాధ్యాయిని విషయమై పత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ సందర్భంగా డీఈవో, టీచర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలు లేని ఈ స్కూల్‌ను ఎత్తివేసి గ్రామంలోని మరో స్కూల్‌లో విలీనం చేస్తామని, టీచర్‌ను డిప్యూటేషన్‌పై పంపుతామని పేర్కొన్నారు.

25న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని బహిరన్‌దిబ్బలో ఈనెల 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు బీమ్ రావ్ యూత్ అధ్యక్షుడు కోర్మోని ప్రభు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లాదుర్గం ఐబీ చౌరాస్తా నుంచి బహిరన్‌దిబ్బ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఉదయం 11 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. దళిత సంఘం నేతలు, బహుజనులు, అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

శివ్వంపేట సర్వేయర్‌గా సతీశ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల సర్వేయర్‌గా సతీశ్ నియమితులయ్యారు. ఇక్కడ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న యాదగిరి వెల్దుర్తికి బదిలీ అయ్యారు. ఆయనస్థానంలో పాపన్నపేట మండల సర్వేయర్ సతీశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రైతులు, ప్రజల సహకారంతో భూసర్వేలు అంకితభావంతో చేస్తానని నూతన సర్వేయర్ సతీష్ అన్నారు.



సర్వేయర్ సతీశ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న జెడ్పీటీసీ

నిజాంపేట(మెదక్): మండలంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన బాధితులకు శుక్రవారం జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ మేరకు లక్ష్మికి రూ.90 వేలు, సిద్ధిరాములుకు రూ.42వేలు ప్రవీణ్ రూ.23వేలు, ఫర్జానా బేగంకు రూ.20 వేలు, స్రవంతికి రూ.18 వేలు.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, నార్లాపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ తీగలు తొలగించండి



డీఈ కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని, గ్రామ శివారు నుంచి విద్యుత్ తీగలు వేయాలని చిట్కుల్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ చిలప్‌చెడ్ మండలం చిట్కుల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్క నుండే 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, విద్యుత్ తీగలను తొలగించి, గ్రామంలో మరోచోట ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



నర్సాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

నర్సాపూర్: కశ్మీర్‌ను భారతదేశంలో కలిపేందుకు తన ప్రాణాలను అర్పించిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): బీజేపీ కార్యాలయంలో పార్టీ నిజాంపేట మండల శాఖ తరపున నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో బీజేపీ నాయకులు, గాంధీ చౌరస్తా వద్ద శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పెద్దశంకరంపేటలో...

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు.

దొంతిలో ఇళ్లలోకి వర్షపు నీరు



ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దొంతిలో కురిసిన వర్షానికి గాను పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. 5వ వార్డులో అండర్‌గ్రౌండ్ మురుగుకాల్వ నిర్మాణంతో ఒంపులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరిందని ప్రజలు తెలిపారు.సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నైరుతి ప్రభావంతో వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఆయా గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ

నిజాంపేట(మెదక్): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సహకారంతో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ జూన్ 23వ తేదీని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధికారిక అంతర్జాతీయ వితంతువుల దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. ప్రపంచంలో 258 మిలియన్ల వితంతువులుంటే కేవలం భారతదేశంలోనే 40 మిలియన్లకుపైగా ఉన్నారని గ్లోబల్ విడోస్ రిపోర్ట్ – 2015 చెబుతోందన్నారు. కొవిడ్–19 మహమ్మారి కారణంగా వారి సంఖ్య మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాల వికాస గ్రామ కమిటీ సభ్యులు జీడి తిరుపతి, మల్లవ్వ, శివ, ఎల్లం యాదవ్, పరుశరాములు సప్తగిరి, ప్రతినిధులు పాల్గొన్నారు.



నిజాంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఈకేవైసీకి తుదిగడువు జూన్ 30

చిలప్‌చెడ్(నర్సాపూర్): పీఎం కిసాన్ పథకానికి అర్హులు కావాలంటే రైతులు ఈనెల 30వ తేదీ లోపు ఈకేవైసీ చేసుకోవాలని ఏఓ బాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఈకేవైసీ సులభతరం అయ్యేందుకు బయోమెట్రిక్, ఫేస్ ప్రమాణికమైన యొబైల్ ఆప్‌ను అందుబాటులోకి వచ్చిందని, వేలిముద్రలు పడని వారు, ఆధార్‌తో ఫోన్‌నంబర్ లింక్ కానివారు, ఈ ఆప్‌తో ఈకేవైసీ చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు పీఎం కిసాన్ డబ్బులు పడవన్నారు.

రైతుబంధుకు చివరి గడువు..

కౌడిపల్లి(నర్సాపూర్): పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి రైతుబంధు రాని రైతులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్‌లో రైతులకు ఈకేవైసీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19లోపు భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబంధు కోసం ఈనెల 30లోపు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కురుమ శేఖులు, నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీ డైరెక్టర్ సంతోష్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌడిపల్లి: రాయిలాపూర్‌లో రైతులకు రైతుబీమా వివరాలు చెబుతున్న ఏఈఓ

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బుల కోసం రైతులు ఈకేవైసీ చేసుకోవాలని కౌడిపల్లి వ్యవసాయ డివిజన్ ఏడీఏ పద్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని భుజిరంపేటలో రైతులకు ఈకేవైసీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ భుజిరంపేటలో 158మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేసుకోలేని చెప్పారు. కార్యక్రమంలో ఏటీఎం నరేందర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌కు పూర్వ విద్యార్థుల విరాళం



శిశుమందిర్‌కు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌కు పూర్వ విద్యార్థులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం వీరప్పకు అల్లాదుర్గం మండలం మాందాపూర్‌కు చెందిన విఠల్‌రెడ్డి కుమారులు భూమ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం రూ.50 వేలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో జైహింద్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

చిన్నశంకరంపేట(మెదక్): మహిళా సంఘాలు సభ్యులు డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్డీఏ అడిషనల్ పీడీ భీమయ్య కోరారు. శుక్రవారం మండలంలోని శాలిపేటలో మహిళా సంఘాల సభ్యులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిజిటల్ లావాదేవీలతో డబ్బులు చెల్లింపు సులభతరం కానుందన్నారు. ఎలాంటి మోసాలకూ అవకాశం లేని డిజిటల్ లావాదేవీలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశం ఏపీఎం లక్ష్మీనారాయణ, సీసీ యశోద పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి రావాలి



విద్యార్థులకు టై, బెల్ట్, షూలను అందజేస్తున్న పరిశ్రమ డైరెక్టర్లు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి రావాలని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ డైరెక్టర్ మహాపాత్ర ఆకాంక్షించారు. శుక్రవారం రంగాయపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న 240 మంది విద్యార్థులకు రూ.లక్షా 70 వేల విలువైన షూ, బెల్ట్, టైలను అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ డైరెక్టర్ మహాపాత్ర మాట్లాడుతూ విద్యార్థులకు అండగా ఉంటామని హామీనిచ్చారు. యాజమాన్యం సీఎస్‌ఆర్ కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడటం అభినందనీయమని హెచ్‌ఎం సంజీవరావు అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్లాంట్ డైరెక్టర్ నృసింగ్ మహాపాత్ర, ఏపీపీ ప్లాంట్ నర్సింహ్మా, ఏజీఎం షణ్ముకేశ్వరరావు, వార్డు సభ్యులు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మెదక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్‌జోన్ : విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాకేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మెదక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసి తన రాజకీయ పబ్బం గడుపుతోందన్నారు. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా కనీసం మౌలికవసతులు లేని పరిస్థితితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారీతిన ఫీజులు పెంచి దోచుకుంటున్నా ప్రభుత్వాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాసమస్యల పరిష్కారం కోసం ఆందోళనను చేస్తే ప్రభుత్వం కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శశికాంత్, నగర కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు జగన్ డిమాండ్ చేశారు.శుక్రవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, దీంతో పిల్లలు సరిగా చదువుకోలేక పోతున్నారని ఆరోపించారు. ఇంకా ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు, పుస్తకాలు సరఫరా కాలేదని, ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం వేధింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 26న మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలుత ఎంఈవో కార్యాలయం ప్రతినిధికి సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

అల్లాపూర్‌లో సామూహిక అక్షరాభ్యాసం

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో జీఎమ్మాఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, సతీశ్ పట్నాయక్ హాజరై విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, సతీష్ పట్నాయక్, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మావతి, సునీత, జ్యోతి, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, వలంటీర్స్ జ్యోతి, పాచలు విద్యార్థులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సీటు వదలి 'స్మార్ట్'గా కాలక్షేపం



కార్యాలయంలో ఖాళీగా కనిపిస్తున్న ఉద్యోగి కుర్చీ

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ కార్యాలయాలపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అందుకు అల్లాదుర్గం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం తార్కాణంగా నిలుస్తోంది. సిబ్బందిలో ఒకరు విధులు నిర్వహించకుండా బయట కుర్చీ వేసుకొని దర్జాగా స్మార్ట్ ఫోన్ చూస్తున్నారు. దీంతో కార్యాలయంలో ఆయన సీటు ఖాళీగా దర్శనమిస్తోంది. ఇప్పటికే మన ఊరు మన బడి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా చేయి తడపందే ఎంబీ బుక్ రికార్డ్స్ కదలడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు కార్యాలయానికి వచ్చినా తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం కనిపించింది.

సంక్షిప్త వార్తలు

◆ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని ఉసిరికపల్లికి చెందిన యాదమ్మ మృతిచెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేల నగదు, నిత్యావసరాలు అందజేశారు. బోజ్యా తండాలో ముగ్గురు అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికీ రూ.5 వేల నగదు, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాపురావ్, రాజునాయక్, ఎంపీటీసీ సత్తిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణారావ్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతిగౌడ్, లక్ష్మీనారాయణ, శేఖర్ తదితరులు ఉన్నారు.

◆ ప్రజాప్రతినిధుల పరామర్శ

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపలి వడ్డెర కాలనీకి చెందిన శంకర్ ఇటీవల మృతిచెందగా, శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జితెందర్‌గౌడ్, కౌన్సిలర్ గజవాడ నాగరాజు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయిస్తామని హామీఇచ్చారు. ఈ మేరకు బాధితకుటుంబానికిరూ. 5 వేలు నగదుతో పాటు బియ్యం బస్తాలు అందజేశారు.

◆ స్వచ్ఛభారత్‌కు సహకరించాలి



పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్‌కు ప్రజలందరూ సహకరించాలని అల్లాదుర్గం ఏపీఓ నవాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛభారత్ ద్వారా చేపట్టిన మరుగుదొడ్లను పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం తప్పనిసరన్నారు. ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామకార్యదర్శులు తదితరులున్నారు.

◆ రామంతాపూర్‌తండాలో ఇంటింటికీ బీజేపీ

వెల్దుర్తి(తూప్రాన్): రామంతాపూర్‌తండాలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్ నిర్వహించారు. మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

◆ చండికాంబ ఆలయంలో పూజలు



శివ్వంపేట (నర్సాపూర్): మండల పరిధిలోని చండిలో చండికాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

◆ గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి



నర్సాపూర్: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు స్థానిక ఎస్ఐ శివకుమార్‌ను కోరారు. శుక్రవారం స్థానిక ఎస్ఐని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అనిల్ మాట్లాడుతూ నర్సాపూర్ మీదుగా గోవుల అక్రమ రవాణా జరుగకుండా అదుపు చేయాలని కోరారు. ఈ రవాణాను అడ్డుకునేందుకు పట్టణంలోని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, తనిఖీలు నిర్వహించాలని కోరారు.